# తెలుగు పలుకుబడి

డా.జొన్నలగడ్డ మార్కండేయులు



**తెలుగుభాషకు** ప్రాచీన హోదా సాధించామంటారు కొందరు. మరికొందరు తెలుగు పలుకు మృతభాష అయిపోతోందని గుండెలు బాదుకుంటున్నారు. ప్రాచీన హోదా వచ్చిందన్న సంతోషంగాని, మృతభాష కాబోతోందన్న విచారముగాని తెలుగు భాషకు ఏమీ మేలు చేయవు. అసలైన తెలుగు జాతీయ పదజాలము మనం మరిచిపోతున్నాం. తెలుగు పలుకుబడిని గుర్తించలేక పోయినా తెలుగు పలుకుబడిని సేకరించడం అందరి కర్తవ్యం అని చెప్పడమే ఈ వ్యాసావళి ప్రధానోద్దేశం.

## 2

**మనకట్టు, బొట్టు,** మాటతీరు, ఎక్కడున్నాసరే మనకో ప్రత్యేక గుర్తింపునిచాయి. అవి ప్రపంచంలో ఏ మారుమూల ప్రదేశములో ఉన్నామన హుందాతనానికి, వివేకానికీ చిహ్నాలుగా మనల్ని పటిస్తాయి. ప్రపంచ దేశాల మధ్య ఈ ఇంటర్నెట్ యుగంలో దూరం తరిగిపోయింది. అందుచేత కట్టు, బొట్టు విషయంలో నిబంధనలు బాగా తగ్గిపోయాయి. అయినా వివాహం, పండగలు, పబ్బాలు మొదలైన ఆచారవ్యవహారాలలో సంప్రదాయ ముద్ర, మనల్ని మన సంస్కృతిని పరి రక్షించి మనము తెలుగువారమని మన కట్టు, బొట్టు ద్వారా చాటి చెపుతుందంటే అసత్యం కాదు. కట్టుబొట్టు ఒక ప్రత్యేక ఆకర్షణే! కాదనలేం. అయితే మాట్లాడడం కూడ ఒక కళ.

మాట్లాడడం చేతకాకపోతే ‘ఊరుకున్నంత ఉత్తమము‘ లేదంటారు. అయితే కొందరిమాట కటువుగా ఉండడమేకాక యదార్థమే అయినా కొంచెం హుందాగా మాట్లాడి ఉంటే బాగుండును అని అనిపించేలా ఉంటుంది. ఏ దురుద్దేశము లేకపోయినా మాట్లాడడము చేతకాదనిపించుకునే పరిస్థితి ప్రతివారికి జీవితంలో ఒక్కసారైనా ఎదురవుతుంది.

ఒకప్పుడు పూర్తిగా తెలుగే మాట్లాడే రోజులలో మన పూర్వికులు అమంగళార్థము స్ఫురించకుండా జాగ్రత్త పడేవారు. తెగిపోయింది అంటే వచ్చే అపార్థాన్ని తొలిగించడానికి మంగళసూత్రం విషయంలో ‘పెరిగిపోయింది‘ అనే పదాన్ని సృష్టించి ‘తెగిపోయింద‘న్నపుడు వచ్చే అమంగళార్థాని దూరం చేశారు. ‘దీపం కొండెక్కింది‘ అనేవారు తప్ప ఆరిపోయింది అంటే అనవద్దు అనేవారు. లేదు అనేకన్న ‘నిండుకుంది‘ అని చెప్పడమే హుందాగా భావించారు. సాధ్యమైనంత వరకూ పలుకు బడిలో కటుత్వం కన్న మార్ధవంతో కూడిన ఆర్ధ్రత తెలుగు పలుకుబడిలో ఎక్కువ.

ఉదాహరణకు తెలుగు పలుకుబడిని చూడండి. తీసుకున్న డబ్బు ఎగవేసినపుడు ‘ఆముదం రాశాడురా‘ అంటారు దుఃఖం వచ్చినపుడు ‘కడుపు చెరువైపోతుంది‘ అంటారు. కోపతాపాలు వచ్చినపుడు ‘కారాలు మిరియాలు నూరుతున్నాడు‘ అంటారు. పని జరిగిందీ లేనిదీ తెలుసుకోవడానికి ‘కాయా? పండా?‘ అని అడుగుతారు. మహాకవులు కారణంగానే జనసామన్యంలో పురాణాలలోని

పదాలు సజీవంగా తెలుగు పలుకుబడిలో నిలిచిపోయాయి. 'బ్రహ్మాండం' అనే మాట భాగవతంలోనిది. శ్రీమన్నారాయణుడు బలి చక్రవర్తి ఇచ్చిన నేలను గొప్పగా ఆక్రమించాడు. ఆ అర్థం వచ్చే బ్రహ్మాండ పలుకుబడిని సింప్లీ సుపర్బ్ అనే పదం బ్రహ్మాండంగా తెలుగును మింగేస్తోంది. 'వెల్‌కం' అని ఆనందాన్ని వ్యక్తం చేయడానికి పూర్వికులు "ఊరకరారు మహాత్ములు" దయచేయండి అనివాడిన పదములు వాడుకలోంచి ఎందుకు నిష్క్రమిస్తున్నాయి?

ఒకప్పుడు తెలుగు సీమలో ప్రతిభోజన ఫలహారశాల ముందు 'దయచేయండి' అనే ఆహ్వానం ఉండేది. 'దయచేయండి' అనే పదం ఇప్పుడు 'పొండి' అనే వెటకారపు పలుకుబడికి ఉదాహరణ అవుతోంది. ఎందుకంటే ఇప్పుడు ఇంగ్లీషు భాష, ఒకప్పటి సంస్కృత భాషలా మన జీవితంలో అంతర్భాగమైపోయింది. ఇదివరకు ఉభయ భాషా ప్రవీణ అంటే తెలుగు సంస్కృతాలు అనర్గళంగా మాట్లాడగలిగి మెప్పించేవాడని అర్థం. ఇప్పుడు భాషాప్రవీణ కళాశాలలు మూతబడిపోయే పరిస్థితులలో 'అశ్వద్ధామ హతః కుంజరః' లా సంస్కృతాన్ని పైకి కనబడనీయకుండా తెలుగుపండితుల్ని తయారు చేస్తూ ఓరియంటల్ బి.ఏ పట్టాలతో తెలుగు, ఇంగ్లీషు నేర్పుతున్నాయి. అందుచేత తెలుగు, సంస్కృతాలకన్న ఆంగ్లభాషా పదప్రయోగ ఉపన్యాసక పండితులు తెలుగు సాహిత్య పలుకుబడి గొప్పతనాన్ని చెప్పే ప్రయత్న ప్రయాణంలో, దేశవిదేశాలలో తమ ఆంగ్ల భాషా ప్రవీణత 'అలవాటులేని ఔపాసనం మీసాలను కాల్చింది' అన్న చందంలా తెలుగు పలుకుబడికి సమాంతరంగా పెరిగే అవకాశాన్నిస్తున్నారు. సహజ భావాలు, అంద చందాలు, ఛందస్సు, యతి ప్రాసలు, శబ్దాలంకారాలు, అంత్యప్రాసలు, పదలాలిత్యం, భావగాంభీర్యం తెలుగు పలుకులో ఉపయోగించినవి మనం మరిచిపోతున్నాము.

'మబ్బు విడిచిన ఎండ భరించలేము.' 'అప్పుదొరికితే పప్పుకూడు.' 'కళ్యాణము వచ్చినా, కక్కు వచ్చినా ఆగదు.' 'ముంజేతి కంకణానికి అద్దమెందుకు' 'చల్లకు వచ్చి ముంత దాచనేల' ఇలా ప్రసంగ వశాన ఆకట్టుకునేవి వినుటకు ఇంపు కలిగించేవి మనందరికీ వచ్చినవి ఉద్దేశపూర్వకంగానే సంభాషణలలోంచి దూరం చేసుకుని తేటతెలుగు తీయన అని అనకుండా sweetest language అనే పదప్రయోగానికి అలవాటు పడడం అవసరమా?.

తెలుగువారి పలుకులతీరు, తలుపుల తీరు కూర్పుల తీరు నిత్యవ్యవహారములోనే కవిత్వ గానములుగ కలగాపులగంగా ఉంటాయన్నది పెద్దలమాట.

తెలుగుబడి చిన్నతనలోనే అలవాటవ్వాలి. 'పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా..', 'నానాటికి తీసికట్టు నాగం భొట్లు..' ఇవి పద్యపాదాలు. తల్లిదండ్రులను ఈసడించినా, ఉన్నత స్థానం నుంచి పతనమైన వారిని చూసినా ఇవి అలవోకగా సంభాషణలలో దొరిలే అలవాటు తెలుగు వారిది. నీతిశతకాలు, వేమన్న వేదం మన తెలుగు పలుకుబడి. ఆయా పాదాలలోని కుదించబడ్డ నీతి తెలుగు పలుకుబడిగా సంభాషించడానికి నేటి తరం దూరమవడం అందరినీ ఆలోచింప చేయవలసిన విషయం. ఎందుకంటే ఒకతరంలో ప్రతిభావంతులైన కవుల, రచయితల పాత్రలు, నీతులు జనసామాన్యాన్ని ప్రబోధం చేసి సంభాషణలలోకి ప్రవేశించాయన్నది నిజం.

లయ, యతి ప్రాసలు మన ఆటపాటలలో కూడా ఉన్నాయి. అవి సేకరణకు మాత్రమే పరిమితమయ్యాయి. ఆ సేకరణ చూసినపుడు 'ఓహో' అనే తెలుగుమాటకన్న 'వావ్' అనే వారిలో తెలుగువారే "పొలాలనన్నీ హలాల దున్ని.. ఇలాతలంలో హేమం పిండగ బలం ధరిత్రికి బలికావించే కర్షక వీరుల ఘర్మజలానికి, ధర్మజలానికి.. ". అని వృత్యనుప్రాస అంత్యప్రాసతో పరుగెత్తించిన శ్రీశ్రీ 'పొలం', 'హలం' 'ఇలాతలం' పదాలు జనసామాన్యము నుంచే స్వీకరించాడు. తెలుగు అందాలనే అందించగలిగాడు. 'పతితులార, భ్రష్టులార, బాధాసర్పద్రష్టులార' అనే అంత్యానుప్రాస తెలుగు అందంతో సమాజాన్ని ఛందస్సుకాని ఛందస్సుతో పలకరించాడు. అయితే ఛందస్సు, యతిప్రాసలు అలంకారములతో కవులతో సమానంగా తెలుగుపలుకుబడిని సజీవంగా నిలిపిన ప్రయత్నం తెలుగు పలుకుబడి గర్వించదగిన సంభాషణ ప్రక్రియ తెలుగు సామెతల సృష్టికర్తలది. వాళ్ళు ప్రజాకవులు. చక్కటి దృష్టాంతాలనందించిన సామెతలలోని

తెలుగుపలుకుబడిని ఆస్వాదించేముందు తెలుగు కవుల గురించి చెప్పిన ఒక కవిగారి మంచి మాటను చెప్పుకుందాం. "కవులకంటె తుహిన కర్పూర నిభకీర్తి -- తెచ్చిరెవరు నీకు తెలుగు తల్లి సాహితీ తరంగ రసధుని - దేశభాషలందు తెలుగులెస్స"

(కొనసాగింపు వచ్చేసంచికలో)

✡ ✡ ✡